

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. డప్పు వాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాలతో పాటు పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా అమ్మవారికి జలబిందెలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కోటేరు శ్రీలక్ష్మి, పలువురు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పెద్దాపురంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

జగ్గయ్యపేట: మండలంలోని తక్కెళ్లపాడు, తిరుమలగిరి గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తెల్లవారుజాము నుంచే గ్రామస్తులు పవిత్ర జలాలతో గ్రామాల్లో డప్పువాయిద్యాలతో వీధుల్లో తిరుగుతూ అమ్మవారికి సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ మొక్కులు తీర్చుకున్నారు.

పుష్పాలంకరణలో ముత్యాలమ్మ

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాస ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నోముల శివకుమార్, కొంకిమళ్ల సురేష్, అప్పన పిచ్చయ్య పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పుష్పాలంకరణలో ముత్యాలమ్మవారు



ఉదయభానుకు తిరుపతమ్మ ఆలయ ఈఓ అభినందనలు

పెనుగంచిప్రోలు: టీటీడీ పాలకమండలి సభ్యుడిగా ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రమాణస్వీకారం చేశారు. ఆయనను స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ ఈఓ, హదీరాంజీ మఠం, తిరుమల ఫిట్ పర్సన్ కె. రమేష్‌నాయుడు కలుసుకుని అభినందనలు తెలియజేశారు.


విప్ ఉదయభానును అభినందిస్తున్న ఈఓ రమేష్‌నాయుడు

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కంచికచర్ల(వీరులపాడు): కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ శంకర్‌బాబు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' జరుగుతుందన్నారు. సమస్యలపై అర్జీలు అందజేయాలని ఆయన సూచించారు.

కారు బోల్తా..తప్పిన ప్రమాదం

ముండ్లపాడు క్రాస్‌రోడ్స్(పెనుగంచిప్రోలు): మండల పరిధిలోని జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద కారు బోల్తా పడిన ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన రెయిలింగ్‌ను ఢీకొని పల్టీలు కొట్టి ముండ్లపాడు వెళ్లే సర్వీసు రోడ్డుపై బోల్తా పడింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవటంతో కారులో ఉన్న ఇద్దరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. కారులో ఇరుక్కున్న వారు రోడ్డుపై వెళ్తున్న వాహనదారుల సాయంలో బయటకు వచ్చారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

నందిగామ: నందిగామ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వాతావరణం వేసవి కాలాన్ని తలపిస్తోంది. ఈ తరుణంలో ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.







ఉపాధి పనుల్లో లోపాలు గుర్తిస్తే చెప్పండి

డీఆర్పీ ప్రసాద్

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి, బలుసుపాడు గ్రామాల్లో ఆదివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. డీఆర్పీ ప్రసాద్ మాట్లాడుతూ 2022-23కు సంబంధించి గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహించారని, ఈ పనుల్లో కూలీలు, గ్రామస్తులకు అభ్యంతరాలుంటే సభ దృష్టికి తీసుకురావాలన్నారు. పనుల్లో అవకతవకలు జరిగినా మండల స్థాయిలో జరిగే సభలో జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సామాజిక తనిఖీ వివరాలను వెల్లడించారు. సర్పంచ్‌లు సూర్యప్రకాశరావు, త్రివేణి, ఎస్ఆర్పీ సింహాద్రి, ఏపీవో సంతోష్, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



147 మందికి కంటి వైద్య పరీక్షలు

నందిగామ: మానవ శరీరంలో కంటికి ఎంతో ప్రాధాన్యత ఉందని దానిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. కొమ్మినేని ఫౌండేషన్, శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మాగల్లు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన రవిశంకర్ మాట్లాడుతూ కొమ్మినేని ఫౌండేషన్ ద్వారా ప్రతి సంవత్సరం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ కంటి చూపు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం వైద్యులు మంజూష, త్రినుజ 147 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆపరేషన్లకు 91 మందిని గుర్తించామని, ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఏటి పట్టు గ్రామాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని

రేషన్ కార్డు అందజేత

జగ్గయ్యపేట అర్బన్: సాంకేతిక కారణాల వలన ఏడాదిన్నర కాలంగా రేషన్ కార్డు రద్దయి ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ చొరవతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. స్థానిక 5వ వార్డుకు చెందిన గుండ్లకంట అమీనాబీ కుటుంబానికి రేషన్ కార్డు కొన్ని సాంకేతిక పరమైన ఇబ్బందులతో ఒక సంవత్సరన్నర క్రితం అధికారులు కార్డును రద్దు చేశారు. విషయాన్ని వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో చర్చించారు. ఆదివారం అమీనాబీ కుటుంబ సభ్యులకు కౌన్సిలర్ మనోహర్ వలంటీర్‌తో కలిసి రేషన్ కార్డును అందజేశారు.















